పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం బీచ్ పర్యాటకులతో ఆదివారం కళకళలాడింది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు సుదూర ప్రాంతాల నుండి ప్రత్యేక, ద్విచక్ర వాహనాలపై బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలు దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేశారు.

గాడి తప్పిన పరీక్షల నిర్వహణ..!

విద్యార్థులకు ప్రశ్నాపత్రాలు సైతం ఇవ్వని విద్యాశాఖ
బోర్డుపై ప్రశ్నలు చూసి పరీక్ష రాయాల్సిన దుస్థితి
45 నిమిషాల్లో రాయాల్సిన పరీక్ష గంటన్నరపైనే
విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకూ పరీక్షే
ప్రభుత్వ విధానాలతో మసకబారుతున్న విద్యావ్యవస్థ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'నాడు-నేడు' అంటూ హడావుడి చేస్తున్న ప్రభుత్వం విద్యార్థులకు అత్యంత ముఖ్యమైన చదువు, పరీక్షల విషయంలో మాత్రం ఏమాత్రం పట్టించుకోని దుస్థితి నెలకొంది. విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా ఉపాధ్యాయులు లేక ప్రభుత్వ పాఠశాలల్లో చదువు కునరిల్లుతుండగా పరీక్షల నిర్వహణ విధానంసైతం అస్తవ్యస్తంగా తయారైంది. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ప్రతియేటా ఎఫ్ఎ-1, ఎఫ్ఎ-2, ఎఫ్ఎ-3, ఎఫ్ఎ-4 పరీక్షలతోపాటు, ఎస్ఎ-1, ఎస్ఎ-2 పరీక్షలను విద్యాశాఖ నిర్వహిస్తోంది. పరీక్ష అంటే ప్రశ్నాపత్రాలు ఇస్తే విద్యార్థులు వాటికి సమాధానాలు రాయాలి. అయితే ఎఫ్ఎ-1, ఎఫ్ఎ-3కి ప్రశ్నాపత్రాలు ఇస్తున్న విద్యాశాఖ, ఎఫ్ఎ-2, ఎఫ్ఎ-4 పరీక్షలకు మాత్రం ప్రశ్నాపత్రాలు ఇవ్వడం లేదు. పరీక్షకు గంటన్నర ముందు వాట్సాప్‌లో ప్రశ్నాపత్రం స్కూళ్లకు పంపుతున్నారు. ఈ పేపర్‌లో ప్రశ్నలను ఉపాధ్యాయులు బోర్డుపై రాస్తే, ఆ ప్రశ్నలను విద్యార్థులు రాసుకుని పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఉంది. ఈ నెల మూడో తేదీ నుంచి ఐదో తేదీ వరకూ మూడు రోజులపాటు ఎఫ్ఎ-2 పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలు రాసేందుకు విద్యార్థులు నానావస్థలు పడుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా లెక్కలు తీస్తే ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మూడు వేలకుపైగా ఉన్నాయి. వీటిలో మూడు లక్షల మందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ఎఫ్ఎ పరీక్షలకు సమయం 45 నిమిషాలు మాత్రమే. 20 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్షకు సంబంధించిన ప్రశ్నలు బోర్డుపై ఉపాధ్యాయులు రాస్తే వాటిని రాసుకుని పరీక్ష రాయడానికి విద్యార్థులకు గంటన్నరకుపైగా పడుతోంది. ఈ విధానంలో కాపీయింగ్ పెద్దఎత్తున సాగుతోంది. బోర్డుపై రాసేందుకు ఉపాధ్యాయులు సైతం నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఒకరిద్దరు ఉపాధ్యాయులు ఉన్నచోట అన్ని ప్రశ్నాపత్రాలు బోర్డుపై రాయడం కష్టతరంగా మారడంతో ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు. ప్రశ్నాపత్రాలు ఇవ్వకుండా నిర్వహిస్తున్న పరీక్షల విధానంపై విద్యార్థుల తల్లిదండ్రులు సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఎస్ఎ-1, ఎస్ఎ-2 పరీక్షలకు ప్రశ్నాపత్రం ఇస్తున్నప్పటికీ జవాబులు రాసేందుకు ఇచ్చే తెల్లకాగితాలు విద్యాశాఖ ఇవ్వడం లేదు. పరీక్షలకు సంబంధించి విద్యార్థుల నుంచి ఎటువంటి ఫీజులూ వసూలు చేయరాదని నిబంధనలు చెబుతున్నాయి. ఎక్కడైనా వసూలు చేసేందుకు ప్రయత్నించినా ప్రధానోపాధ్యాయులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఉపాధ్యాయులకు ఏంచేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే మూడు, నాలుగు, ఐదు తరగతులను హైస్కూల్లలో విలీనం చేయడంతో ప్రభుత్వ విద్య పూర్తిగా గాడితప్పింది. ఇప్పుడు పరీక్షల విధానంలో విద్యాశాఖ వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలు కూడా ఇవ్వకపోతే విద్యార్థులు ఏవిధంగా పరీక్షలు రాయాలో ప్రభుత్వమే చెప్పాలి. పరీక్షల ప్రశ్నాపత్రాలు కూడా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందా అంటూ తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా పేద కుటుంబాలకు చెందినవారే. ఈవిధంగా పరీక్షలు నిర్వహిస్తే విద్యార్థులు ఏవిధంగా చదువులో రాణిస్తారో ప్రభుత్వమే చెప్పాలి. ప్రశ్నాపత్రాలు ఇవ్వకుండా పరీక్షలు నిర్వహించడం పలు గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆకివీడులో నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

విద్యుత్ భారాలపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి - ఆకివీడు

ఇప్పటికే అనేక సమస్యలతో సతమతమవుతున్న ప్రజానీకంపై విద్యుత్ ఛార్జీలు పెంచి మరో భారాన్ని మోపడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా స్థానిక 14వ వార్డులోని రైల్వేగేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో గోపాలన్ మాట్లాడుతూ ఇప్పటికే సరైన ఉపాధి అవకాశాలు లేక ఆర్థిక సమస్యలతో ప్రజానీకం సతమతమవుతున్నారన్నారు. ఈ తరుణంలో ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం వేయడం ఆర్థికంగా మరింత ఇబ్బందుల్లోకి నెట్టడమేనన్నారు. కాకులను కొట్టి గద్దలకు పెట్టిన తీరులో పేదలను కొట్టి కార్పొరేట్లకు సంపద కట్టబెడుతుందన్నారు. ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించుకోకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, డోకల లక్ష్మి, ఎస్.సూరిబాబు, డోకల రవితేజ, కె.శంకర్, బివి.వర్మ, బి.రాంబాబు పాల్గొన్నారు.

ఎబిఎస్‌వికెలో రేపు ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య శిబిరం ఈ నెల 10వ తేదీ మంగళవారం ఉదయం మెంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహిస్తారని వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాద్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. తేజ హాస్పిటల్ అధినేత డాక్టర్ పొన్నమండ చంద్రశేఖర్‌వర్మ అవసరమైన వారికి ఇసిజి, ఎకో పరీక్షలు చేసి వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని అంతా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పిఎంపి, ఆర్ఎంపిల సేవలు అమోఘం

ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

మాట్లాడుతున్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

కరోనా సమయంలో పిఎంపిలు, ఆర్ఎంపిల సేవలు అమోఘమని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. స్థానిక క్లాత్‌మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో అపోలో ఆసుపత్రి, హైదరాబాద్ సారథ్యంలో మానవత సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన పిఎంపి, ఆర్ఎంపిల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మల మాట్లాడుతూ కరోనా సమయంలో పెద్ద వైద్యులు వైద్యం అందించడానికి నిరాకరించడం, ప్రభుత్వాసుపత్రిలో కనీసం బెడ్ దొరకని పరిస్థితుల్లో ఆర్ఎంపిలు రోగుల ఇళ్ల వద్ద అందించిన సేవల వల్ల ఎందరో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా వీరు ఫస్ట్ ఎయిడ్‌గా అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అపోలో వైద్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మానవత సభ్యులు ముత్యాల శ్రీనివాస్, మేడిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డాడిస్ రోడ్డు క్యూఆర్ యాప్ ఉపయోగకరం

ఎఎస్‌పి సుబ్బరాజు

ప్రజాశక్తి - భీమవరం

వాహనదారుల భద్రత కోసం డాడిస్ రోడ్ క్యూఆర్ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా అడిషనల్ ఎస్‌పి సుబ్బరాజు అన్నారు. స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానం ఎదురుగా 'డాడిస్ రోడ్' కార్యాలయాన్ని ఎఎస్‌పి సుబ్బరాజు, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ తనయుడు గ్రంధి రవితేజ, ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ మేడిది జాన్సన్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంధి రవితేజ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. సమాజానికి ఎంతో ఉపయోగకరమైన యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాడిస్ రోడ్ ఎమ్‌డి వర్మ మాట్లాడుతూ ప్లేస్టోర్‌లో డాడిస్ రోడ్ యాప్ అందుబాటులో ఉందని, ఈ క్యూఆర్ స్టిక్కర్లతో 8 రకాల ఉపయోగాలున్నాయని తెలిపారు. ప్రమాద సందేశం, రక్తనిధి, పార్కింగ్ సమస్య, పత్రాలు భద్రపరచడం, రిమైండర్లు, లాక్ హెచ్చరిక, టోయింగ్ హెచ్చరిక, వాహన ప్రమాద హెచ్చరిక ఇలా ఎన్నో వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఒక్కసారి యాప్‌ను ఉపయోగించుకుంటే వాహన, ప్రమాద భద్రతకు ఎంతో సహకరిస్తుందని, అన్ని వివరాలను అన్ని వేళలా తెలియజేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో తోట భోగయ్య, కోళ్ల బాలకృష్ణ, చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ రాష్ట్రంలో పచ్చి నియంత పాలన సాగుతోందని, కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తమ గోడు చెప్పుకునేందుకు ప్రయత్నిస్తుంటే జగన్ సర్కార్ అరెస్టులు, దాడులకు పాల్పడుతోందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. స్థానిక ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. గత నాలుగున్నరేళ్లుగా ప్రతిపక్షాలకు అపాయింట్‌మెంట్ ఇవ్వని ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో నిలిచిపోయారన్నారు. 144 సెక్షన్, 30 యాక్టులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ప్రజావేదిక కూల్చివేతతో దారి తప్పిన పాలన నేటికి పరాకాష్టకు చేరుకుందన్నారు. రాష్ట్రంలో రోడ్లు అత్యంత అధ్వానంగా ఉన్నాయని, రైతుభరోసా కేంద్రాలు నామమాత్రంగా మిగిలాయని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలను విద్యుత్ ఛార్జీలతో దోచేస్తున్నారని, పెరిగిన విద్యుత్ ఛార్జీలపై ఈ నెల తొమ్మిదో తేదీ సోమవారం నుంచి 15వ తేదీ వరకు వివిధ దశల్లో వామపక్షాలు ఆందోళనకు పిలుపునిచ్చాయన్నారు. ప్రజలంతా ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జగన్, కేంద్రంలో మోడీని గద్దె దింపడానికి భావ సారూప్యత కలిగిన పార్టీలతో కలిసి పని చేస్తామన్నారు. టిడిపి, జనసేన ఇండియా కూటమిలోకి రావాలని ఆకాంక్షిస్తున్నామని, వీరిద్దరూ బిజెపితో కలిస్తే రాష్ట్రంలో జగన్ మళ్లీ గెలుస్తాడని అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతిమంగా వైసిపి బిజెపితో వెళ్లి దేశాన్ని అధోగతి పాలు చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, బొద్దాని నాగరాజు, కళింగ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడండి

ఆర్‌టిసి భీమవరం డిపో మేనేజర్ గిరిధర్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఆర్‌టిసి భీమవరం డిపో మేనేజర్ గిరిధర్‌కుమార్ అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆర్‌టిసి గ్యారేజీ ప్రాంగణంలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ గిరిధర్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ కార్యాలయం, పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను నాటడం మంచి కార్యక్రమమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ కీర్తిశేషులు కంతేటి సత్యవతి పేరిట వారి కుటుంబ సభ్యుల సహకారంతో 28 మొక్కలను ఆర్‌టిసి గ్యారేజీకి అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్యారేజ్ ఎఎస్ఎఫ్ ఎస్.కోటేశ్వరరావు, సెక్యూరిటీ అధికారి గణపతి పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న ఆర్‌టిసి డిఎం గిరిధర్

ఆసరాగా వైఎస్ఆర్ బీమా

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు



చెక్కు అందిస్తున్న పివిఎల్

మృతుల కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా పథకం ఆసరాగా నిలుస్తోందని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నర్సింహరాజు అన్నారు. పాలకోడేరులో గుండుబోయిన సత్యనారాయణ ఇటీవల ప్రమాదంలో మృతి చెందారు. ఆయన కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు వైఎస్ఆర్ బీమా పథకంలో మంజూరు చేశారు. అనంతరం మిగిలిన రూ.4.90 లక్షల చెక్కును ఆదివారం మృతుని భార్య కనకదుర్గకు పివిఎల్, ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు) కలిసి అందజేశారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలోనే తక్కువ సమయంలో సాయం అందుతోందన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఆ విధంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. పాలకోడేరు సొసైటీ ఛైర్మన్ కొత్తపల్లి కాశీవిశ్వనాథరాజు, సర్పంచి ఇంజేటి మరియమ్మ, ఉప సర్పంచి దెందుకూరి వెంకటరాజు, ఎంపిటిసి సభ్యులు నాగల లక్ష్మి, వెంకటలక్ష్మి, పాపాసాహెబ్, కె.సత్యనారాయణరాజు, కృష్ణంరాజు పాల్గొన్నారు.

కొనసాగిన టిడిపి నిరసనలు

ఉండిలో న్యాయానికి సంకెళ్లు పేరిట వినూత్న నిరసన

ఉండిలో మాజీ ఎంఎల్ఎ శివను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుపై ఆ పార్టీ ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆదివారం స్థానిక టిడిపి నాయకులతోపాటు సీనియర్ నాయకుడు మద్దుల రాము నేతృత్వాన 14వ వార్డు ముత్యంవారితోట మహిళలు పాల్గొన్నారు. దీక్షకు టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి, రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, వేంద్ర శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి ప్రసాద్, కృష్ణబలిజ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు గంటా త్రిమూర్తులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మెంటే పార్థసారధి, కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు త్వరలోనే జైలు నుండి విడుదల కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నేతలు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, జంపన ధనరాజు, బొక్కా సూరిబాబు, చెల్లబోయిన సుబ్బారావు, చెల్లబోయిన గోవింద్, లంకి చిన్ని, విజ్జురోతు రాఘవులు, యలమంచిలి శ్రీనివాస్, నేదునూరి గంగాధర్, నల్లం గంగాధర్, దొంగ వెంకటేశ్వరరావు, రొంగల కృష్ణవేణి, ఉప్పలపాటి లక్ష్మి పాల్గొన్నారు.

పాలకొల్లు: చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఆదివారం 26వ రోజు స్థానిక గాంధీ బొమ్మల సెంటర్లో రిలే నిరాహార దీక్షలో యలమంచిలి మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడగా, టిడిపి మండలాధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు, మాజీ జెడ్‌పిటిసి బోనం నాని మాట్లాడగా మాతా రత్నరాజు, చిట్టూరి రామాంజనేయులు, చిన్ని పాల్గొన్నారు.

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ కుట్రపూరిత రాజకీయాలను చేస్తుందని ఉండి మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు విమర్శించారు. స్థానికంగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు 25వ రోజు ఆదివారం ఆయన సంఘీభావం తెలిపారు. శివరామరాజు గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మెయిన్ సెంటర్లో న్యాయానికి సంకెళ్లు పేరిట వినూత్న రీతిలో మండుటెండలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శివరామరాజు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిన ఏ ప్రభుత్వమూ మనుగడ సాగించలేదనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు. చంద్రబాబును బేషరతుగా విడుదల చేయాలని శివరామరాజు డిమాండ్ చేశారు. అయితే శివరామరాజు నిరసన దీక్షను ఆకివీడు ఎస్ఐ నాగబాబు, కాళ్ల ఎస్ఐ వీరభద్రరావు, ఉండి ఎఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ భగ్నం చేసి దీక్షను విరమింపజేశారు.

తెలుగు యువత ఆధ్వర్యాన ఆదివారం సాయంత్రం గాంధీ విగ్రహం నుంచి అబ్బాయిరాజు విగ్రహం వరకు మోకాళ్లపై నడిచి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడు మాట్లాడగా నాయకులు దూబ సురేష్, కొత్తకోట అనిల్, పాలపర్తి బాలాజీ, గోవర్ధన్, కోణాల దిలీప్, కోణాల సందీప్ పాల్గొన్నారు.

ఆచంట: చట్టాలను కాలరాస్తూ పాలన సాగిస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు చవిచూడక తప్పదని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ హెచ్చరించారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆచంటలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 26వ రోజు ఆదివారం కొనసాగాయి. ఈ సందర్భంగా నేతలు మెడకు ఉరితాళ్లు వేసుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, పార్టీ మండల అధ్యక్షులు కేతా మీరయ్య, నేతలు నెక్కంటి ప్రభాకర్, సూర్యనారాయణ, ప్రసాద్, రాంబాబు, సత్యనారాయణ, నాగార్జున, నరసింహమూర్తి, మోహన్, మురళీ, శ్రీను పాల్గొన్నారు.

భీమవరంలో..

ఆచంటలో..

రేకులు పగిలి అస్తవ్యస్థంగా తయారైన పైకప్పు

పగిలిన రేకులు.. పట్టించుకోని అధికారులు..!

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎండకు ఎండి, వానకు తడుస్తున్న మోటార్లు

నిత్యం పట్టణ ప్రజలకు తాగునీరందించే సర్వీస్ రిజర్వాయర్ వన్ వద్ద సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన రేకుల షెడ్డు శిథిలావస్థకు చేరుకుంది. ప్రధానంగా రేకులు పగిలిపోయి వర్షం, ఎండకు నిలువ నీడ లేని పరిస్థితి ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోవట్లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్షం కురిస్తే ఆ షెడ్డులో తలదాచుకునే పరిస్థితి లేదు. దీంతోపాటు పట్టణంలో మరమ్మతు పాలైన లక్షలాది రూపాయలు విలువ చేసే కరెంట్ మోటర్లు ఇక్కడే భద్రపరుస్తున్నారు. అవీ వర్షానికి తడుస్తూ.. ఎండకు ఎండుతూ దెబ్బతింటున్నాయి. ఇప్పటికైనా షెడ్డు మరమ్మతు చేపట్టాలని సిబ్బంది, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎంపిడిఒ పద్మజ

చిట్‌చాట్

ఎంపిడిఒ పద్మజ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండల ప్రజల సమస్యల పరిష్కారానికి అన్నివిధాలా కృషి చేస్తున్నామని పెనుమంట్ర ఎంపిడిఒ పొట్లాడ పద్మజ అన్నారు. విశాఖ జిల్లాలో పుట్టిన ఆమె స్కూల్ లెక్చలర్ అవుదామని అనుకున్నారు. కాని ఎంపిడిఒగా అవకాశం వచ్చిందని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు.

ప్రశ్న : స్వగ్రామం ఎక్కడ? ఎక్కడ ఎంతవరకు చదువుకున్నారు?

జవాబు : విశాఖపట్నం జిల్లా మాధవధార స్వగ్రామం. సెయింట్ జోసెఫ్ కాలేజీ, జ్ఞానాపురంలో 1993లో బిఎ చేశాను. తల్లిదండ్రులకు మూడో సంతానం.

ప్రశ్న : ఇప్పటివరకు ఎక్కడెక్కడ పనిచేశారు?

జవాబు : 1993 నుంచి 20 సంవత్సరాల పాటు పెందుర్తి, మరో ఆరేళ్ల అనకాపల్లిలో ఎలమంచిలి దగ్గర రాంబిల్లి, అనంతరం పరవాడలో ఇఒపిఆర్‌డిగా పని చేశారు. ఉద్యోగోన్నతిలో భాగంగా ఇక్కడ ఎంపిడిగా బాధ్యతలు స్వీకరించానని తెలిపారు.

ప్రశ్న : అవార్డులు? మర్చిపోలేని సంఘటనలు ఏమైనా ఉన్నాయా?

జవాబు : 2018 రాంబిల్లిలో ఆగస్టు 15న కలెక్టర్ ప్రవీణ్ కుమార్ చేతులమీదుగా, గతేడాది 2022లో పరవాడలో, జనవరి 26వ తేదీన రవి సుభాష్ చేతులమీదుగా ఉత్తమ సేవా అవార్డులు అందుకున్నాను. రాంబిల్లిలో చేస్తున్న సమయంలో హుదూద్ తుపానుకు అక్కడ ప్రజలకు చేసిన సేవలు మరువలేమన్నారు.

ప్రశ్న : ఉద్యోగ పరంగా ప్రోత్సహిస్తున్న మీ కుటుంబంలో వ్యక్తి ఎవరు?

జవాబు : నా భర్త సిహెచ్.కోటేశ్వరరావు వెన్నంటే ఉండి ప్రోత్సహిస్తారు. 1993 సంవత్సరంలో సిహెచ్.కోటేశ్వరరావుతో నాకు వివాహమైంది. ఆయన వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో చేస్తుంటారు. మాకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న రామరాజు

దాట్ల శ్రీదేవి ట్రస్ట్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కాళ్లకూరు గ్రామంలో పేద, బడుగు, బలహీన వర్గాల వారికి దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా సహాయం అందించడం అభినందనీయమని ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ బహుజన సంఘాల సమాఖ్య వ్యవస్థాపకులు సొడదాసి గంగయ్య అన్నారు. కాళ్లకూరు గ్రామానికి చెందిన దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు మానవతా దృక్పథాన్ని చాటుకుంటున్నారు. కాళ్లకూరు గ్రామానికి చెందిన దండే రాజారావు అనారోగ్యంతో మృతి చెందారు. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న వెంకటరామరాజు మృతుని కుటుంబసభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సహాయం ఆదివారం అందించారు.

అన్నసమారాధనలో యాత్రికులు

పాలకొల్లులో భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాలు ముగింపు సందర్భంగా పెద్దఎత్తున మహిళలు అన్నసమారాధనలో పాల్గొన్నారు. మాజీ ఎంఎల్‌ఎ అల్లు వెంకట సత్యనారాయణ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని కొంతసేపు వడ్డించారు. ఈ సందర్భంగా ఆలయంలో 10 కేజీల లడ్డును వేలం వేశారు. పాలకొల్లు టాక్సీ స్టాండ్ దగ్గర కూడా భారీ అన్నసమారాధన నిర్వహించారు.

నేరాలు - ఘోరాలు

అత్యాచారం కేసులో నిందితుడికి రిమాండ్

ప్రజాశక్తి - వీరవాసరం

బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. వీరవాసరం ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన వీరవాసరం గ్రామానికి చెందిన బాలిక ఈ నెల ఐదో తేదీ రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా 11 గంటల సమయంలో అదే ప్రాంతానికి చెందిన రాపాక సురేష్ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడని బాలిక అమ్మమ్మ మరుసటి రోజు ఆరో తేదీన వీరవాసరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు సురేష్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. సదరు కేసును ఎస్‌పి పర్యవేక్షణలో, భీమవరం దిశ డిఎస్‌పి ఎన్.మురళీకృష్ణ దర్యాప్తు చేసి నిందితుడు రాపాక సురేష్‌ను ఏడో తేదీన అరెస్టు చేసి భీమవరం కోర్టులో హాజరుపర్చగా కోర్టు వారు నిందితునికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

మహిళపై దాడి ఘటనలో నలుగురిపై కేసు

ప్రజాశక్తి - పోడూరు

మహిళను గాయ పరిచిన నలుగురిపై పోడూరు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుమ్మలూరుకు చెందిన వెంకట్రావు ఆర్‌టిసి కండక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం ఆయన డ్యూటీకి వెళ్లారు. ఇంట్లో ఉన్న ఆయన భార్య మంగపై నలుగురు వ్యక్తులు దాడి చేశారు. దంపతులకు, వారి బంధువులకు మధ్య సరిహద్దు వివాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం ఉదయం వారి బంధువులు అడ్డాల శివ, శివనారాయణతో పాటు మరో ఇద్దరు గోడ దూకి ఇంట్లోకి ప్రవేశించి అసభ్య పదజాలంతో తిట్టి మంగపై దాడి చేశారు. దీంతో మంగ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ డి.రామ్‌కుమార్ కేసు నమోదు చేశారు. దాడిలో గాయాలపాలైన మంగను వైద్యం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి పంపినట్లు పోలీసులు తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - పోడూరు

కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు, కోళ్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గుమ్మలూరు గ్రామంలో కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోడూరు ఎస్‌ఐ డి.రామ్‌కుమార్ తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.650 నగదు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

శిథిల భవనంలో సచివాలయం..!

పెచ్చులూడి ప్రమాదకరంగా తయారైన వైనం

భయాందోళనలో ఉద్యోగులు

శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్న భవనం

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక ఆనాల చెరువు వద్ద పెద్దపేటలో ఉన్న పాత బిసి హాస్టల్ భవనం పెచ్చులూడిపోయి ప్రమాదకరంగా మారడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయం నెలకొంది. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనం కూలడానికి సిద్ధంగా ఉంది. అందులో పిల్లలు నివసిస్తే ప్రమాదవని అధికారులు నిర్ణయించిన అనంతరం సుమారు ఐదేళ్ల క్రితమే అదే ప్రాంగణంలో సంక్షేమ శాఖ మరో భవనం నిర్మించింది. విద్యార్థులను ఆ భవనంలోకి పంపించారు. అయితే అప్పటినుంచి ఆ భవనం ఖాళీగానే ఉంది. సుమారు సంవత్సరంన్నర క్రితం ఇక్కడ సచివాలయ కార్యాలయాలు విడగొట్టడంతో ఒక కార్యాలయాన్ని ఈ భవనంలో ప్రారంభించారు. ఆకివీడు -1 కార్యాలయాన్ని సుమారు ఒకటిన్నర సంవత్సరంగా ఇక్కడే నిర్వహిస్తున్నారు. ఇక్కడ ప్రాంగణం మొత్తం మురికి మయంగా తయారైంది. మొత్తం వర్షపు నీరు, మురికి నీటితో ఉద్యోగులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భవనంలో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ భయంతో విధులు నిర్వహిస్తున్నారు. ఏ నిమిషంలో ఏ భాగం ఊడి ఎవరి నెత్తి మీద పడుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. ప్రజలు ఇక్కడికి రావడానికి ధైర్యం చేయడం లేదు. హాస్టల్ పిల్లలు ఎప్పుడైనా ఎవరైనా ఇటు వస్తే ప్రమాదానికి గురయ్యే అవకాశం లేకపోలేదు. విద్యార్థులు నివసించడానికి పనికిరాదన్న భవనం ప్రజా కార్యాలయంగా మార్చడం విచిత్రంగా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

లాభాల బాటలో కాళ్లకూరు సొసైటీ

రైతుల సేవలో సహకార బ్యాంక్

సొసైటీ భవనం


వ్యవస్థాపకులు వెంకట సోమరాజు

ప్రజాశక్తి - కాళ్ల

సహకార సంఘాలు చాలా వరకు రుణ వితరణ, ఇతర సేవలకే పరిమితం అవుతున్నాయి. మరికొన్ని సంఘాలు రైతుల అవసరాలు, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా రైతుల అభివృద్ధికి తోడ్పడుతున్నాయి. ఈ కోవకు చెందినదే కాళ్లకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం. చిన్న సంఘమైనా సేవల్లో ముందుంటూ రైతులు, ప్రజల మన్ననలు పొందుతోంది. కాళ్లకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం 45 ఏళ్ల నుంచి ఏ గ్రేడ్ తరగతి సొసైటీగా పేరుగాంచి ప్రగతి పథంలో పయనిస్తోంది. 27 ఏళ్లుగా సభ్యుల నుంచి రికవరీలో ప్రథమ స్థానం పొంది ఏటా అవార్డులు అందుకుంటోంది.

మంచి దృక్పథంతో..

గ్రామీణ రైతులకు రుణాలు అందించే 1939లో పెన్మత్స వెంకట సోమరాజు కాళ్లకూరు సహకార సంఘాన్ని ఏర్పాటు చేశారు. సొసైటీ మొదటి అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 375 మంది సభ్యులతో ప్రారంభమైంది. 1939 నుంచి 1968 వరకు 29 ఏళ్ల పాటు ఏకధాటిగా ఏకగ్రీవంగా ఎన్నికై సొసైటీ అభివృద్ధికి తోడ్పడ్డారు. సంఘం తొలినాళ్లలో కేవలం రూ.వేలల్లో మాత్రమే లాభాలను ఆర్జించేది. సొసైటీ అధ్యక్షుల పర్యవేక్షణ, సిబ్బంది పనితీరు, సభ్యుల సహకారంతో డిపాజిట్లు గణనీయంగా పెరిగాయి.

లాభాల బాటలో...

ప్రస్తుతం 2,686 మంది సంఘ సభ్యులు ఉన్నారు. డిపాజిట్లు రూ.16, 12,82,432 షేర్ క్యాపిటల్ 1,01, 65,222 ఉంది. డిసిసిబిలో ఇన్వెస్ట్‌మెంట్స్ రూ.4, 62,12,983, సంఘ రిజర్వ్ నిధులు 2,71,71,044, డిసిసిబి రిజర్వ్ నిధులు రూ.1,11,23,312, ఇతర డిపాజిట్లు రూ.40,73,259, డిసిసిబి బారో యింగ్స్ రూ.5, 28,65,236 సంఘం లాభాల బాటలో పయనిస్తోంది.

వార్షిక టర్నోవర్ రూ.35.74 కోట్లు

సహకార బ్యాంకులో రూ.35,74,13,194 వార్షిక టర్నోవర్ నడుస్తోంది. పంట రుణాలు, బంగారు ఆభరణాలు, చేపల మేత వివిధ రకాల రుణాలు మంజూరు చేస్తూ రైతులకు, ప్రజలకు చేయూతనిస్తూ రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకుంటూ సొసైటీని సభ్యులు ముందుకు నడిపిస్తున్నారు. కాళ్లకూరు, జువ్వలపాలెం, ఏలూరుపాడు గ్రామాల రైతులకు, ప్రజలకు సేవలందిస్తోంది. రైతులకు రూ.18. 99 కోట్లు (18,98,90,162)రుణాలు అందించారు.

మొబైల్ ఎటిఎం..

రైతులు, ప్రజల కోసం డిసిసిబి ద్వారా మొబైల్ ఎటిఎం ప్రతి శనివారం కాళ్లకూరులో అందుబాటులో ఉంటోంది. అన్ని రకాల ఎటిఎం కార్డులు ఈ మొబైల్ ఎటిఎంలో ఉపయోగించుకోవచ్చు. జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఏలూరు ఆధ్వర్యంలో రూ.15 లక్షలతో మొబైల్ ఎటిఎం ఏర్పాటుచేసి కాళ్లకూరు సొసైటీ పరిధిలో ఉన్న కాళ్లకూరు, జువ్వలపాలెం, ఏలూరుపాడు గ్రామ రైతులు, ప్రజలకు మంచి సౌకర్యాన్ని కల్పించారు. రైతులకు తక్కువ వడ్డీతో రుణాలు ఇవ్వడమే కాకుండా వారి కుటుంబ ఆర్థిక స్వాలంభనకు సహకార బ్యాంక్ ఎంతో ఉపయోగపడుతుంది. డిపాజిట్లపై వడ్డీరేటు పది శాతం (ఏడాది కాలపరిమితి), బంగారు, ఆభరణాలపై 12శాతం రుణాలు అందిస్తుంది.

నూరుశాతం బకాయిలు వసూలు

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు చేతుల మీదుగా ఛైర్మన్ మాదు సురేష్, సెక్రటరీ ఇబ్బా శ్రీనివాస్ జ్ఞాపికను అందుకున్నారు. కాళ్లకూరు సొసైటీలో డిపాజిట్లు, రుణాల పెంపుదల, ఇచ్చిన రుణాలు నూరుశాతం వసూలు, సొసైటీ పనితీరు, సొసైటీ ప్రగతిని పరిశీలించి ఈ అవార్డు అందించారు. 2022-23లో బ్యాంకు బకాయిలు నూరు శాతం వసూలు చేసి రూ.37,25,236 నికరలాభం వచ్చింది.

పెరిగిన డిపాజిట్లు

మాదు సురేష్ , త్రిసభ్య కమిటీ ఛైర్మన్, కాళ్లకూరు

సంఘం డిపాజిట్లు గతంలో రూ.10,50,93,000 ఉండేది. ప్రస్తుతం రూ.16,12,82,432 డిపాజిట్లు సేకరించాం. రూ.2,61,58,000 డిపాజిట్లు పెరిగాయి. సొసైటీ ద్వారా రైతులకు, ప్రజలకు విస్తృతత సేవలు అందిస్తాం.


పివిఎల్ చేతులమీదుగా జ్ఞాపికను అందుకుంటున్న సొసైటీ ఛైర్మన్, సెక్రటరీ

రూ.37 లక్షలు నికర లాభం

ఇబ్బా శ్రీనివాస్, సొసైటీ కార్యదర్శి

సొసైటీ అధ్యక్షులు, సిబ్బంది సమిష్టి కృషితో సంఘం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. రైతులకు రూ.18.99 కోట్ల రుణాలు అందించాం. రూ.2,63,87,091 అప్పు పెరిగింది.

తప్పుడు పోస్టులు పెట్టినవారిపై చర్యలు తీసుకోవాలి

పోలీసులకు జెడ్‌పిటిసి సభ్యులు పెద్దిరాజు ఫిర్యాదు

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న జెడ్‌పిటిసి సభ్యులు పెద్దిరాజు

ప్రజాశక్తి - పోడూరు

సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టి తన ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా, కుల విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా కుట్రలు పన్నుతున్న టిడిపి కొవర్ట్లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరు పెద్దిరాజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలానికి చెందిన పార్టీ నాయకులతో కలిసి ఆదివారం ఆయన స్థానిక ఎస్‌ఐ డి.రామకుమార్‌కు ఫిర్యాదు చేశారు. తాను దళితులను దూషించినట్లుగా లేనిపోని అపనిందలతో ఈ నెల 7వ తేదీన పాలకొల్లు పట్టణానికి చెందిన టిడిపి కోవర్టు బుంగ తిరుమలరాజు ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టినట్లు పెద్దిరాజు ఫిర్యాదులో పేర్కొన్నారు. జిన్నూరు గ్రామానికి చెందిన గిరిగి గోపాలకృష్ణ, పాలమూరుకు చెందిన బుంగ పవన్‌లు తిరుమల రాజుకు సహకరించి తనను కించపరిచి ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే విధంగా కుట్ర పన్నుతున్నారని పెద్దిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. వారి ముగ్గురిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పెద్దిరాజుతో పాటు వైసిపి మండల ఇన్‌ఛార్జి కలిదిండి గణపతిరాజు, జెసిఎస్ కన్వీనర్ బల్ల రాజశేఖర్, ఎపి హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దపాటి పెద్దిరాజు, ఎపి సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు, పోడూరు సర్పంచి శెట్టిబత్తుల సువర్ణరాజు, జున్నూరు, పెనుమాదం సొసైటీ ఛైర్మన్లు డిటిడిసి బాబు, కొరపాటి వీరస్వామి ఉన్నారు.

180 మంది ఉపాధ్యాయ దంపతులకు సత్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఉపాధ్యాయులు విద్యార్థుల జీవితాలను మలుపు తిప్పే మార్గదర్శకులు అని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. అక్టోబర్ ఐదో తేదీ అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలకొల్లు రామచంద్ర గార్డెన్స్‌లో ఆదివారం రాత్రి ధర్మారావు ఫౌండేషన్ ఛైర్మన్ తరపున పాలకొల్లు నియోజకవర్గంలోని 180 మంది ఉత్తమ ఉపాధ్యాయ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులను పాఠాలకు మాత్రమే పరిమితం చేయాలని, ఇతర పనులకు వాడుకోవడం వల్ల ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. సమాజం మంచిగా ఉండటానికి విలువలు ఉండాలని చెప్పారు. తాను ఉపాధ్యాయునిగా పనిచేయడం వల్ల ఉపాధ్యాయుల సాధకబాధకాలు తెలుసని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, ఎంఇఒ కృష్ణంరాజు, టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, జివి, కర్నేన రోజారమణి, బోనం నాని, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, కెవి కృష్ణవర్మ పాల్గొన్నారు.

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం రద్దీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భజన కాలక్షేపం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రయివేట్ కళాశాలల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షునిగా బ్రహ్మాజీ

పలువురి అభినందన

బ్రహ్మాజీ

ప్రజాశక్తి - నరసాపురం

సూర్య జూనియర్ కళాశాలలకు సెక్రటరీ, కరస్పాండెంట్ గంటసాల బ్రహ్మాజీ ప్రయివేట్ కళాశాలల అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం తణుకులో గమని ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఎపిజెఎంఎ అసోసియేషన్ సమావేశంలో ఆయన ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రయివేట్ కళాశాలల యాజమాన్యం ఆయనను అభినందించారు.

సర్పంచి ధర్మారెడ్డికి మాతృవియోగం

రామతులసి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - పెనుమంట్ర

నత్తా రామేశ్వరం సర్పంచి వెలగల ధర్మారెడ్డి తల్లి రామతులసి (67) గుండెపోటుతో రాజమండ్రిలోని ఆసుపత్రిలో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ధర్మారెడ్డి తండ్రి వెంకటరెడ్డి కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. వీరికి ముగ్గురు సంతానం కలరు. కుటుంబ సభ్యులకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, సీనియర్ నాయకులు ఆకుల హరేరామ్, మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు, ఎంపిపి కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసురెడ్డి), ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ (మిస్సమ్మ), జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీసుభాషిణి, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షుడు తమనంపూడి వీరెడ్డి, గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు సానుభూతి తెలిపారు.

జగ్గరాజుకు బాపిరాజు పరామర్శ

ప్రజాశక్తి - కాళ్ల

ఏలూరుపాడు గ్రామ సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు మాతృమూర్తి భూపతిరాజు వెంకట నరసయమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. భూపతిరాజు జగ్గరాజు కుటుంబ సభ్యులను తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు-అన్నపూర్ణ దంపతులు ఆదివారం పరామర్శించారు. వెంకట నరసయమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.


జగ్గరాజును పరామర్శిస్తున్న బాపిరాజు

టిడిపి విజయానికి కృషి చేయాలి

ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

రానున్న ఎన్నికల్లో టిడిపి విజయానికి కృషి చేయాలని పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని వల్లంపర్రులో తెలుగుదేశం పార్టీ సాధికార మిత్ర, సేవా మిత్ర తెలుగు యువత ఐటిడిపి సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం కోసం, పార్టీ బలోపేతానికి చేయాల్సిన కృషి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి దొడ్డ శ్రీనివాసు, క్లస్టర్ ఇన్‌ఛార్జి పాముల రజిని, పార్టీ గ్రామ ప్రెసిడెంట్ పాశర్ల సింహాచలం, సత్యనారాయణ, పెచ్చెట్టి బాబు, యువత అధ్యక్షులు నీలం తాతాజీ, కొండేటి నరేష్ రావడ వెంకటేశ్వరరావు, పార్టీ గ్రామ అధ్యక్షులు, సెక్రటీర్లు, సేవా మిత్ర, సాధికార మిత్ర బూత్ కన్వీనర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కాళ్లకూరు గ్రామంలో ఉన్న స్వయంభూ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి 14 వరకు సప్తనదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ ఛైర్మన్ దండు వెంకటకృష్ణంరాజు, ఆలయ ఇఒ మోకా అరుణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. గంగా, యమునా, సరస్వతి, గోదావరి, కృష్ణా, తుంగభద్ర, నర్మద నది జలాలతో ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబర్ 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు శ్రీలక్ష్మీ శరన్నవరాత్రి మహోత్సవాలు (దసరా మహోత్సవాలు) జరుగుతాయన్నారు. శ్రీలక్ష్మి అమ్మవారికి తుమ్మపూడి శివప్రసాద్ శర్మచే విశేష అలంకరణలు చేయనున్నట్లు తెలిపారు.

15 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరిగే శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడును ఆహ్వానించారు. ఈ మేరకు క్షీర రామలింగేశ్వర స్వామి ఆలయం ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యాళ్ల సూర్యనారాయణ ట్రస్టీలు ఎంఎల్‌ఎను ఆయన కార్యాలయంలో ఆదివారం కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. 15వ తేదీ నుంచి రోజు ఒక్కొక్క అవతారంగా అమ్మవారిని అలంకరిస్తారని ఈ సందర్భంగా వారు తెలిపారు.

జనసేన జిల్లా అధ్యక్షులు చినబాబుకు అభినందన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జనసేన జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు(చినబాబు)ను జనసేన-టిడిపి సమన్వయ కమిటీలో సభ్యుడిగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నియమించారు. ఈ సందర్భంగా గోవిందరావును ఆ పార్టీ భీమవరం నియోజకవర్గ ఎంపిటిసి సభ్యులు కలిసి అభినందనలు తెలిపారు. జిల్లా నుంచి ఎన్నికైన నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్‌కి కూడా అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ వచ్చే 2024 ఎన్నికల తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధితో కూడిన సంక్షేమ ప్రభుత్వం ఏర్పడాలనే లక్ష్యంతో ఇరు పార్టీలు సమన్వయంతో పని చేస్తాయన్నారు. జిల్లాలో 15 సీట్లలో ఒక్క సీట్ కూడా వైసిపి గెలవకూడదని, 15కి15 సీట్లు రెండు పార్టీల కూటమి మాత్రమే గెలవాలని అందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అంతా కలిసికట్టుగా పని చేసి అధ్యక్షుల వారికి బహుమతిగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. గ్రామాత అభివృద్ధికి స్థానిక సంస్థల ద్వారా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, అవినీతి ప్రతి ఇంటికి తీసుకెళ్లాలన్నారు. చినబాబును కలిసినవారిలో ఎంపిటిసి సభ్యులు ఆరేటి వాసు, తాతపూడి రాంబాబు, విజయలక్ష్మి, ఇందిరా, ఆదిలక్ష్మి ఉన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి :: తణుకు
ఓ.ఎస్.నెం. 185/2017
బిట్వీన్:
వాది: కౌరు సత్యవతి
మరియు
ప్రతివాదులు:
గుత్తుల ఈశ్వరరావు మరియు వగైరా
5వ ప్రతివాది: గుత్తుల లక్ష్మి, భర్త: ఈశ్వరరావు, డో.నెం. 15-3/1, రామాలయం దగ్గర, బొక్కావారి పాలెం, భీమవరం, జె.సి.జె.
పై నెంబరు గ్రంధములో శ్రీ కోర్టు వారు మీయొక్క Appearance నిమిత్తం పలుమార్లు సమన్లు ఇచ్చియున్నప్పటికీ మీరు హాజరు కాకుండా కాలయాపన చేయుచు ఇందున, మీ యొక్క Appearance నిమిత్తం **ది.10-10-2023న ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు కావలెను.** లేని ఎడల పరోక్షముగా తీర్మానింపబడుదురని తెలియజేయడమైనది.
ఎన్.వి.ఎస్.ఎస్.పి.రామమోహన్
ఎన్.వి.ఎస్.రామానుజం
తణుకు, అడ్వకేట్స్, తణుకు.
8-10-23. సెల్: 99088 22433